సాక్షి ఆదిలాబాద్

సోమవారం | 30 | డిసెంబర్ | 2024



## సెలవంటూ వెళ్లిపోయారు..!

ఈ ఏడాది ఉమ్మడి జిల్లా పరిధిలో పలువురు ప్రముఖులు పరమపదించారు. గుస్సాడీ నేస్తం కనకరాజు, గోండిలిపి యోధుడు కోట్నాక్ జంగు లోకం విడిచారు. 8లో▸



## వైభవోపేతం... కల్యాణోత్సవం

జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో కొనసాగుతున్న 85వ శ్రీ ఆయుత మహాచండీ యాగంలో భాగంగా ఆదివారం రాత్రి శ్రీ ఉమామహేశ్వర కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. భక్తుల శివనామస్మరణతో ప్రాంగణం మార్మోగింది. – ఆదిలాబాద్

## న్యూస్‌రీల్

### 'కుంటాల'కు పర్యాటకుల తాకిడి



జలపాతం వద్ద పర్యాటకుల సందడి

**నేరడిగొండ:** మండల పరిధిలోని కుంటాల జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచే భారీగా తరలివచ్చారు. జలపాతం వద్ద అందాలను తిలకించారు. పర్యాటకులకు జాగ్రత్తలు పాటించాలని ఎఫ్‌బీవో సచిన్ సూచించారు.

### రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న సీఐ సునీల్ కుమార్

**ఆదిలాబాద్‌టౌన్:** పట్టణంలోని రైతుబజార్ ఎదుట వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయడంతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు రైతులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం రైతుబజార్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పారు. రోడ్డుపై ఎవరూ కూరగాయల విక్రయాలు జరపొద్దని, దీంతో వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు కేటాయించిన షెడ్లలో విక్రయాలు జరపాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# అభివృద్ధి వైపు అడుగులు



జిల్లా కేంద్రంలోని వ్యవసాయ పరిశోధన స్థానం



కొనసాగుతున్న ఎన్‌హెచ్ 353 రోడ్డు నిర్మాణ పనులు

- జిల్లాకు పత్తి పరిశోధన ఉపకేంద్రం
- మొదలైన ఎన్‌హెచ్ 353(బి) పనులు
- కొత్తగా మూడు మండలాలు
- రిమ్స్‌కు 60 సీట్లతో డీఎంఎల్‌టీ కోర్సు

రివైండ్ 2024

అడవులు, ఆదివాసీలతో కూడిన ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది అభివృద్ధి దిశగా అడుగులు పడ్డాయి. ఇక్కడి పత్తికి మహర్దశ కల్పించేలా జిల్లాకు కేంద్ర ప్రభుత్వం పత్తి పరిశోధన కేంద్రాన్ని మంజూరు చేసింది. దీంతో భవిష్యత్తులో మరింత నాణ్యమైన పత్తి ఉత్పత్తే లక్ష్యంగా ఇక్కడ జాతీయస్థాయిలో పరిశోధనలు సాగనున్నాయి. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భోరజ్ నుంచి చంద్రాపూర్ వరకు గల అంతర్రాష్ట్ర రహదారికి జాతీయ హోదా లభించి పనులు సైతం మొదలయ్యాయి. అంబారీ నుంచి పిప్పల్‌కోటి వరకు విద్యుదీకరణతో కూడిన రైల్వేప్రయాణం ప్రారంభమై వ్యాపార, వాణిజ్య అభివృద్ధికి మార్గం సుగమమైంది. పలు గ్రామాల ప్రజల దశాబ్దాల కలను నిజం చేసేలా కొత్తగా మూడు మండలాలకు సైతం మోక్షం లభించింది. పారామెడికల్ కోర్సుల్లో ఉచిత విద్యనందించేలా ప్రత్యేక కోర్సులను మంజూరు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలతో జిల్లా అభివృద్ధికి కొంత ప్రయోజనం చేకూరగా వచ్చే ఏడాదిలోనూ ఇదే ఒరవడి కొనసాగితే మరింత ప్రయోజనం కలుగవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. – కైలాస్‌నగర్

కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ కింద పనిచేసే భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) దేశంలో సాగయ్యే అన్ని పంటలకు సంబంధించి పరిశోధనలు చేస్తోంది. తాజాగా అఖిల భారత పత్తి పరిశోధన పథకం (ఏఐసీఆర్‌పీ) కింద ఆదిలాబాద్‌కు పత్తి పరిశోధన ఉపకేంద్రాన్ని మంజూరు చేసింది. కాటన్ సాగులో నూతన వంగడాలను రైతులు సాగు చేస్తున్నారు. వీటిలో చీడపీడల సమస్యతో విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా రెండు దశాబ్దాల క్రితం జిల్లాలో పత్తికి సంబంధించి నాన్‌బీటీ రకాలైన సంకర, సూటితో పాటు దేశావళి రకాలను సాగు చేసేవారు. ఆదిలాబాద్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అప్పటినుంచి ఆ వెరైటీలపైనే

### నాణ్యమైన పత్తి ఉత్పత్తికి దోహదం..

పరిశోధనలు చేస్తూ వస్తున్నారు. 2002–03 నుంచి బీటీ పత్తి విత్తనాల సాగును రైతులు అవలంభిస్తున్నారు.ఈ సాగులో రైతులు కొత్త కొత్త సమస్యలను ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయంగా తెలంగాణ పత్తికి, అందులో ఆదిలాబాద్ పత్తికి డిమాండ్ ఉన్నందున ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు పరిశోధన కేంద్రం ఏర్పాటు తోడ్పడనుంది. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి.. ఈ కేంద్రం అందుబాటులోకి వచ్చే అవకాశముంది. దీంతో నాణ్యమైన పత్తి ఉత్పత్తి అయ్యే అవకాశమేర్పడి రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

మహారాష్ట్ర నుంచి బేల, జైనథ్ మీదుగా భోరజ్ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి 353 బి నిర్మాణ పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. 10 మీటర్ల వెడల్పుతో విస్తరించి హైవే నిబంధనలకు అనుగుణంగా నిర్మిస్తున్నారు. దీని ద్వారా గుజరాత్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రలకు ప్రయాణించవచ్చు. భోరజ్ నుంచి ఆప్టికి వెళ్లే క్రమంలో మధ్యలో రాజురా వద్ద 930డి ఎన్‌హెచ్ కూడా దీనికి కలుస్తుండటం గమనార్హం. తద్వారా 353బి జాతీయ రహదారి ఇరువైపులా అనేక జాతీయ రహదారులను కలపడం ద్వారా దేశంలోని అనేక రాష్ట్రాలకు వెళ్లేందుకు అనువుగా మారనుంది. మహారాష్ట్రలోని

### వాణిజ్య రవాణాకు తోడ్పడేలా ఎన్‌హెచ్

గడ్‌చాందుర్, రాజురా, చంద్రాపూర్‌లో పలు సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఏటా 23 మిలియన్ టన్నుల మేర ఇక్కడ ఉత్పత్తి చేసే సిమెంట్ బ్యాగుల్లో 35 శాతం రవాణా మార్గంలో ఆదిలాబాద్ మీదుగా మధ్య మహారాష్ట్రలోకి, ఇటు తెలంగాణ జిల్లాలోకి తరలిస్తారు. అంతేకాకుండా మహారాష్ట్రలోని మాజిరి, గుగ్గుస్‌లో ఉత్పత్తి అయ్యే బొగ్గును కూడా ఈ ప్రాంతాల గుండా రవాణా చేస్తారు. బల్లార్షా లోని పేపర్ మిల్లు, దుర్గాపూర్‌లోని పవర్‌ప్లాంట్ వద్ద ఉత్పత్తి అయ్యే ఫ్లైయాష్ రవాణా కూడా జరుగుతుంది. ఈ రహదారి నిర్మాణంతో ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు పెరిగి వాణిజ్య రావాణా మెరుగుపడనుంది.

జిల్లాకు రైల్వే సౌకర్యం ఉన్నప్పటికీ విద్యుదీకరణతో కాకుండా ఇంధనంతో కూడిన రైలు ప్రయాణమే అందుబాటులో ఉండేది. దీంతో ప్రయాణం నెమ్మదిగా సాగేది. దీన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం మహారాష్ట్రలోని అంబారీ నుంచి ఆదిలాబాద్ జిల్లా మీదుగా పిప్పల్‌కోటి వరకు 58 కిలోమీటర్ల మేర రూ.70 కోట్ల వ్యయంతో విద్యుదీకరణ సౌకర్యం కల్పించింది. ఇందులో జిల్లాలో 46.5 కిలోమీటర్లు, మహారాష్ట్రలోని నాందేడ్, యావత్మాల్ జిల్లాల్లో 11.5 కిలోమీటర్ల పరిధి

### విద్యుదీకరణతో రైల్వే ప్రయాణం

ఉంది. ఈ విద్యుదీకరణతో కూడిన రైల్వే ప్రయాణాన్ని ఈ ఏడాది మార్చి 4న జిల్లా కేంద్రంలోని స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. దీంతో ఆదిలాబాద్ నుంచి సికింద్రాబాద్, బెంగుళూరు, నాగ్‌పూర్ వరకు అంతరాయం లేని వేగంతో కూడిన రైల్వే ప్రయాణం సాగనుంది. వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధికి దోహదపడినట్లయింది.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను వారికి మరింత చేరువచేసేలా ప్రభుత్వం జిల్లాలో

### పాలన చేరువయ్యేలా...

కొత్తగా మూడు మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో బోథ్‌లో సొనాల, జైనథ్‌లో భోరజ్, బేల, ఆదిలాబాద్ రూరల్, జైనథ్ మండలాల్లోని పలు గ్రామాలను విభజించి కొత్తగా సాత్నాల మండల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసింది. సర్కారు ఆదేశాలకనుగుణంగా అధికారులు ఆయా మండలాల్లో పాలన వ్యవహారాలు ప్రారంభించేలా కసరత్తు చేపట్టారు. మండల కార్యాలయాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. కొత్త ఏడాదిలో ఆయా కార్యాలయాల్లో పాలన వ్యవహారాలు ప్రారంభమయ్యే అవకాశముంది.



సొనాలలో కార్యాలయాల ఏర్పాటుకు ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)



### 60 సీట్లతో కొత్త కోర్సు

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రిమ్స్ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఇప్పటికే నర్సింగ్ కళాశాల కొనసాగుతుంది. తాజాగా సూపర్ సేవలను మరింత పటిష్టం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆప్తాల్మిక్, డీఎంఎల్‌టీ కోర్సులను మెడికల్ కళాశాలకు మంజూరు చేసింది. ఆయా విభాగాల్లో 60 సీట్లను కేటాయించింది. దీంతో వైద్య విద్యతో పాటు అనుబంధ కోర్సుల్లోనూ విద్యనభ్యసించేందుకు అవకాశమేర్పడింది. పేద విద్యార్థులకు లబ్ధి చేకూరడంతో పాటు దాని ద్వారా జిల్లాలోని రోగులకు ప్రయోజనం చేకూరే అవకాశముంది.

# డిజిటల్ కంటెంట్‌తో మెరుగైన బోధన

- కలెక్టర్ రాజర్షి షా

**కైలాస్‌నగర్:** ప్రభుత్వ విద్యాకేంద్రాల్లోనూ డిజిటల్ మాధ్యమాలు అందుబాటులోకి వచ్చాయని, వాటితో బోధన చేస్తే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడుతాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఉపకరించేలా జైనథ్ మోడల్ స్కూల్ వృక్షశాస్త్ర అధ్యాపకుడు సత్యనారాయణ రూపొందించిన ఉచిత డిజిటల్ కంటెంట్‌ను కలెక్టర్ ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. మొదటి, రెండో సంవత్సరానికి సంబంధించిన అధ్యాయాలను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల విద్యార్థుల కోసం ఆంగ్లమాధ్యమంలో రూపొందించిన కంటెంట్ బోర్డు పరీక్షలతో పాటు నీట్ వంటి పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా రూపొందించినట్లుగా తెలిపారు. సీడీ, లింక్, క్యూ ఆర్ కోడ్ ద్వారా ఉచితంగా ఈ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, కేజీబీవీ జిల్లా ప్రత్యేక అధికారి ఉదయశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఆరోగ్య పాఠశాల సంధానకర్త అజయ్, ప్రిన్సిపాల్ రాము తదితరులు పాల్గొన్నారు.



సీడీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, డీఈవో

# సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**కైలాస్‌నగర్:** సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారంతో 20వ రోజుకు చేరింది. సెలవు రోజైనా సాయంత్రం వరకు దీక్ష శిబిరంలోనే కూర్చొని తమ నిరసన వ్యక్తం చేశారు. శిబిరాన్ని వారు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. సమగ్ర ఉద్యోగులవి గొంతెమ్మ కోరికలేవి కావని ప్రభుత్వం వెంటనే వారితో చర్చలు జరిపి వారి డిమాండ్లను నెరవేర్చాలన్నారు. వారి న్యాయమైన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. కాగా ఇచ్చోడ రిటైర్డు ఎంఈఓ నారాయణ, బేల సీసీవో అతుల్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ మిథున్ వారికి అన్నదానం ఏర్పాటు చేశారు. మద్దతు తెలిపిన వారిలో అఖిలపక్ష నాయకులు బండి దత్తాత్రి, విజ్జగిరి నారాయణ, దర్శనాల మల్లేశ్, నంది రామయ్య, సిర్ర దేవేందర్ తదితరులున్నారు.



ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

# పత్తి కొనుగోళ్లలో గోల్‌మాల్?

- సీసీఐ కొనుగోళ్లపై విజిలెన్స్ ఆరా
- ఇప్పటికే విచారణకు ఆదేశించిన వైనం
- రైతుల పేరిట వందల క్వింటాళ్లు విక్రయించడంపై అనుమానం
- వివరాల సేకరణలో మార్కెటింగ్ శాఖ



మార్కెట్ యార్డుకు వచ్చిన పత్తి బండ్లు (ఫైల్)

**ఆదిలాబాద్‌టౌన్:** సీసీఐ పత్తి కొనుగోళ్లలో గోల్‌మాల్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజా పరిణామాలు ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. జిల్లాలో కొందరు వ్యాపారులు రైతుల పేరిట సీసీఐకి విక్రయాలు జరిపి లబ్ధి పొందినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొందరు రైతులు వందల క్వింటాళ్ల పత్తిని సీసీఐకి విక్రయించడంపై విజిలెన్స్ దృష్టి సారించింది. ఈ మేరకు వ్యవసాయ మార్కెటింగ్ అధికారులకు లేఖ రాసింది. వివరాలు సమర్పించాలని ఆదేశించింది. వందల క్వింటాళ్లు అమ్మిన రైతులకు ఎంత భూమి ఉంది.. ఎంత దిగుబడి వచ్చింది.. రైతుకు ఉన్న భూమిలో పత్తి పంట వేశారా.. ఇతర పంటలు వేశారా.. ప్రస్తుతం సాగు జరుగుతుందా.. లేదా అనే పది రకాలకు సంబంధించి ప్రశ్నలను మార్కెటింగ్ అధికారులను అడిగారు. వారు రైతులా, వ్యాపారులా అనే కోణంలో విచారణ జరుగుతోంది. ఇందుకు సంబంధించి వారం క్రితమే ఆదిలాబాద్ మార్కెటింగ్ శాఖ అధికారులకు సీసీఐ విజిలెన్స్ అధికారులు వివరాలు కోరారు. ఈ క్రమంలో ఆ శాఖ అధికారులు వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. అయితే అంతా సవ్యంగానే ఉందని, ఎలాంటి తప్పిదాలు జరగలేదని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. విచారణ చేపట్టకముందే వారు చెప్పే మాటలను చూస్తే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఖచ్చితమైన నివేదిక సమర్పిస్తారా.. లేదా తూతూమంత్రంగా విచారణ చేపట్టి ముగిస్తారా అనే చర్చ సాగుతోంది.

**ఐదుగురు రైతుల వివరాలు అడిగిన విజిలెన్స్..**

జిల్లాలో ఈ ఏడాది 4లక్షల 34వేల ఎకరాల్లో పత్తి పంట సాగైంది. 71వేల ఎకరాల్లో సోయా, 52వేల ఎకరాల్లో కంది సాగైంది. అయితే ఇప్పటివరకు 16లక్షల క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేయగా, ప్రైవేట్ వ్యాపారులు లక్ష 50వేల క్వింటాళ్ల కొనుగోలు చేశారు. ఇందులో పలువురు రైతులు మాత్రం వందల క్వింటాళ్ల మేర సీసీఐకి విక్రయించడంపై విజిలెన్స్ అధికారులు విచారణకు దిగారు. పత్తిని విక్రయించిన వారు రైతులేనా, లేక వ్యాపారులా, వారికి ఎంత దిగుబడి వచ్చిందనే దానిపై ఆరా తీస్తున్నారు. జైనథ్ మండలానికి చెందిన ఓ రైతు పేరిట 256 క్వింటాళ్లు, తలమడుగు మండలానికి చెందిన రైతు పేరిట 280 క్వింటాళ్లు, ఆదిలాబాద్‌అర్బన్‌కు చెందిన రైతు పేరిట 336 క్వింటాళ్లు, ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని జందాపూర్‌కు చెందిన ఓ రైతు పేరిట 306 క్వింటాళ్లు, గుడిహత్నూర్ మండలానికి చెందిన ఓ రైతు 312 క్వింటాళ్ల పత్తిని సీసీఐకి విక్రయించారు. క్వింటాలుకు ప్రభుత్వ మద్దతు ధర లభించింది. అయితే ఈ ఏడాది పత్తి దిగుబడి ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు వచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

### గోల్‌మాల్ జరుగుతోందా..?

ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు శనివారం ఓ ఐచర్ వాహనంలో వందల క్వింటాళ్ల పత్తిని తీసుకొచ్చారు. సిబ్బంది నామమాత్రంగా తేమ పరిశీలించారు. అయితే ఓ ట్రాక్టర్‌లో మరో రైతు పత్తిని తీసుకురాగా తేమ శాతం ఎక్కువగా ఉందని, కొనుగోలు చేయమని సిబ్బంది చెప్పడంతో సంబంధిత రైతు ఆందోళనకు దిగాడు. వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై పత్తిని విక్రయించుకొని మద్దతు ధర పొందుతున్నారని, రైతులకు మద్దతు ధర ఇవ్వడం లేదని, తేమ పేరిట కొర్రీలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించాడు. పట్టణంతో పాటు జిల్లాలోని పలు మండల కేంద్రాలు, గ్రామాల్లో కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసి వందల క్వింటాళ్లు సీసీఐకి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వారికి నిబంధనలు వర్తించవా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. సీసీఐ సిబ్బంది, దళారులు, కొంత మంది మునీమ్‌లు మిలాఖతై అక్రమాలకు తెర లేపుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

### అంతా సక్రమంగానే ఉంది

సీసీఐ విజిలెన్స్ అధికారులు ఈనెల 20న ఐదుగురు రైతులకు సంబంధించి వివరాలను అడిగారు. వారి వివరాలు సేకరించి పంపుతున్నాం. అంతా సక్రమంగానే ఉంది. ఎలాంటి గోల్‌మాల్ లేదు. ఓ రైతుకు సంబంధించి వివరాలు సేకరించే పనిలో ఉన్నాం. వచ్చిన తర్వాత సీసీఐ విజిలెన్స్ అధికారులకు సమర్పిస్తాం.

– మధుకర్, మార్కెట్ కార్యదర్శి, ఆదిలాబాద్

# బోధనకు బ్రేక్.. భోజనంతోనే సరి!

- 20 రోజులుగా సమ్మెలో టీచర్లు
- కేజీబీవీల్లో నిలిచిన బోధన
- మూతపడ్డ భవిత రిసోర్స్ సెంటర్లు
- ఇబ్బందుల్లో దివ్యాంగ పిల్లలు

| |
|---|
| జిల్లాలో కేజీబీవీలు: 18 |
| విద్యార్థినుల సంఖ్య: 4,432 |
| పది, ఇంటర్ విద్యార్థినులు: 1024 |
| భవిత రిసోర్స్ సెంటర్లు: 18 |
| వైకల్యం గల పిల్లల సంఖ్య:2,647 |



ఆదిలాబాద్‌రూరల్ కేజీబీవీలో భోజనం చేస్తున్న విద్యార్థులు

**ఆదిలాబాద్‌టౌన్:** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో బోధిస్తున్న ఎస్‌వోలు, సీఆర్టీలు సమ్మెలో ఉండడంతో 20 రోజులుగా చదువులు కుంటుపడ్డాయి. కేజీబీవీల్లో ప్రస్తుతం విద్యార్థినులకు భోజనం అందించడంతోనే సరిపెడుతున్నారు. చదువులు చెప్పేవారు లేకపోవడంతో వారు కాలక్షేపం చేస్తున్నారు. ప్రభుత్వం సమగ్ర ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని, అలాగే విద్యార్థుల భవిష్యత్‌పై సైతం దృష్టి సారించడం లేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కేజీబీవీల్లో ఉంచడంలో ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఇంటికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొంత మంది ఇంటిబాట పట్టారు. జిల్లాలోని ఆయా కేజీబీవీల్లో 4,432 మంది ఉండగా ఇందులో 1280 మంది ఇప్పటికే ఇంటికి వెళ్లిపోయినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే అనధికారికంగా వీరి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

**పరీక్షలు సమీపిస్తుండడంతో ఆందోళన..**

కేజీబీవీల్లో చదివేది పేద విద్యార్థినిలే. ఇందులో ఎక్కువ శాతం తల్లిదండ్రులు లేనివారు, కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారి పిల్లలే ఇక్కడ చదువుకుంటారు. అలాగే చదువు మధ్యలో మానివేసిన వారిని ఇక్కడ చేర్పించి విద్యాబోధన చేస్తారు. ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు సమీపిస్తున్నాయి. చాలా పాఠశాలల్లో ఇంకా సిలబస్ పూర్తి కాలేదు. 20 రోజులుగా సీఆర్టీలు సమ్మెలో ఉండడంతో బోధన జరగడం లేదు. దీంతో తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాగే పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో విద్యార్థినులు సైతం ఆందోళన చెందుతున్నారు. విద్యా శాఖ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో చదువులు కుంటుపడుతున్నాయని వాపోతున్నారు.

**మెనూ ప్రకారం అందని భోజనం..**

కేజీబీవీల్లో భోజనం కోసం సరుకుల బాధ్యత ప్రత్యేక అధికారులది. తమ దగ్గర ఉన్న డబ్బులతో మొదట సరుకులు కొనుగోలు చేసి ఆ తర్వాత బిల్లులు సమర్పిస్తారు. 20 రోజులుగా అటువైపు వెళ్లకపోవడంతో చాలా కేజీబీవీల్లో సరుకులు దగ్గర పడ్డాయి. దీంతో విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందని పరిస్థితి. వారు పెట్టిందే తింటూ పాఠశాలల్లో కాలక్షేపం చేస్తున్నారు. నైట్ వాచ్‌మెన్‌లు వారి పర్యవేక్షణ చూస్తున్నారు.

### భవిత విద్యార్థుల భవితవ్యమేది..

భవిత రిసోర్స్ సెంటర్లలో దివ్యాంగులు, మానసిక వైకల్యం, ఇతర రుగ్మతలతో బాధపడుతున్న పిల్లలకు చదువుతో పాటు వారి ఆరోగ్యంపై దృష్టి సారిస్తారు. ఫిజియోథెరపీ, ఇతర వైద్య చికిత్సలు సైతం అందిస్తారు. అయితే 20 రోజులుగా వీరికి ఈ సేవలు అందకుండా పోయాయి. ఇక్కడ పనిచేసే ఐఆర్‌పీలు, కేర్‌గివర్‌లు సమ్మెలో ఉన్నారు. దీంతో ఈ సెంటర్లు మూతపడ్డాయి. ఫిజియోథెరపిస్టులు అందుబాటులో ఉన్నప్పటికీ సేవలు మాత్రం అందడం లేదు. జిల్లాలో 18 భవిత రిసోర్స్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 30 మంది వరకు సిబ్బంది పనిచేస్తున్నారు. 206 మంది విద్యార్థులు ఆయా కేంద్రాల్లో విద్యతో పాటు ఇతర సేవలు పొందుతున్నారు. అలాగే నడవలేని స్థితిలో ఉన్న 84 మంది చిన్నారులకు సైతం సేవలు అందిస్తున్నారు. పాఠశాలల్లో 900 వరకు వైకల్యం గల పిల్లలు ఉన్నారు. వీరందరికీ ఐఈఆర్పీలు బోధనతో పాటు వైద్య సేవలు అందిస్తున్నారు. మూగ, చెవిటి విద్యార్థులు పాఠశాలకు రావడంతో విద్యాబోధన నేర్చుకుంటారు. తరచూ పిల్లలకు ఫిజియోథెరపీ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియకు సమ్మెతో బ్రేక్ పడడంతో మళ్లీ వారి అవయవాలు చచ్చుబడే పరిస్థితి ఎదురవుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భవిత రిసోర్స్ సెంటర్‌లో పిల్లలకు బోధన చేస్తున్న సిబ్బంది (ఫైల్)

### ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం..



కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం. 17 మంది టీచర్లకు తాత్కాలిక ఎస్‌వోలుగా బాధ్యతలు అప్పగించాం. ప్రస్తుతం 13 మంది గెస్ట్ టీచర్లు పనిచేస్తున్నారు. వీరితో పాటు ఇటీవల నియామకమైన సీఆర్టీలతో విద్యాబోధన సాగుతోంది. అలాగే ప్రతి కేజీబీవీకి ఇద్దరు చొప్పున గెస్ట్ టీచర్లను నియమించేందుకు చర్యలు చేపడుతున్నాం. జిల్లాలోని 18 కేజీబీవీల్లో ప్రస్తుతం 3,152 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులు ఇంటికి వెళ్లడం లేదు. ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతాం.

– ఉదయశ్రీ, సెక్టోరియల్ అధికారి

## క్లుప్తంగా

### ప్రపంచ తెలుగు మహాసభల్లో మనోళ్లు



ప్రశంసాపత్రం, మెమొంటోతో రాజమల్లు



ప్రశంసాపత్రం, మెమొంటోతో మహేందర్

**చెన్నూర్:** విజయవాడలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించిన ఆరో ప్రపంచ తెలుగు మహాసభల్లో మంచిర్యాల జిల్లా చెన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు, రచయిత దబ్బెట రాజమల్లు, మంచిర్యాల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు బొడ్డు మహేందర్ ప్రతిభ కనబర్చారు. సాహితీ సదస్సులో పాల్గొని తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాజమల్లు, మహేందర్‌ను ప్రశంసా పత్రాలతో పాటు మెమొంటోలతో సత్కరించారు.

### రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న గోవర్ధన్ రెడ్డి

**ఆదిలాబాద్:** సీఎం కప్ జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి సీఎం కప్ తైక్వాండో ఎంపిక పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో జిల్లా పేరును అగ్రభాగాన నిలపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారధి, తైక్వాండో జిల్లా ఇన్‌చార్జి అన్నారపు వీరేశ్, రాష్ట్ర టెక్నికల్ కమిటీ చైర్మన్ వెంకటస్వామి, సీనియర్ పీడీ హరిచరణ్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాద్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

### ఉరేసుకుని ఒకరు బలవన్మరణం



ఇందల్ (ఫైల్)

**ఉట్నూర్‌రూరల్:** ఉరేసుకుని ఒకరు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిలీప్ తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన ఆడె ఇందల్ (40) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. శనివారం ఆదిలాబాద్‌లో చికిత్స చేయించుకున్నాడు. రాత్రి కావడంతో ఉట్నూర్‌లో ఉన్న తన సోదరుడు సంజీవ్ ఇంటికి వెళ్లాడు. నొప్పి అధికం కావడంతో భరించలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతునికి భార్య స్వాతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

**లింగాపూర్:** విషయం తెలుసుకున్న రెహమాన్ ఫౌండేషన్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్ మృతుని అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించాడు.



# జీవన వైవిధ్యం.. ప్రాణహితం

మదిని మైమరిపించే ప్రకృతి అందాలు.. జన జీవనానికి ఉపాధినిచ్చే అవకాశాలు.. జీవాలకు ప్రాణం పోసే వనరులు.. ఇవన్నీ కలిసిన ప్రాంతం ప్రాణహిత నదీ తీరం. అబ్బురపరిచే అరుదైన దృశ్యాలకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం తలాయి గ్రామ సమీపంలోని ప్రాణహిత తీరం నిలయంగా ఉంది.

– చింతలమానెపల్లి/బెజ్జూర్

- సహజ సౌందర్యం
- జన జీవనోపాధికి నిలయం
- తలాయి వద్ద అరుదైన అందాలు
- పర్యాటక అభివృద్ధికి అవకాశాలు



కశ్మీర్ దాల్ లేక్ కాదు.. తలాయి తీరం



నదీ తీరంలో జీవనం సాగిస్తున్న కుటుంబం

**సహజ సౌందర్యం..**

ప్రాణహిత నది సహజ సౌందర్యానికి నిలయం. ఇరువైపులా దట్టమైన అటవీ ప్రాంతం. విశాలమైన ఇసుకమేటలు...తీరంలో మొక్కజొన్న చేలు.. నదిలో చేపల వేటకోసం పడవల్లో మత్స్యకారులు.. చేపల వేటకు వచ్చే పక్షుల సందడి..జలకళతో వంపులు తిరుగుతూ ప్రవహిస్తోంది ప్రాణహిత. తెల్ల ఇసుక మడుగుగా స్థానికులు పిలుచుకునే ఈప్రాంతంలో నది అందాలతో హొయలు పోతున్నట్లుగా కనిపిస్తుంది.

**వివాదం.. పరిష్కారం.**

తెలంగాణ, మహారాష్ట్రలకు ప్రాణహిత నది సరిహద్దుగా ఉంది. దీంతో తలాయి వద్ద ఇరు ప్రాంతాల ప్రజలకు వివాదం నెలకొంది. చేపలు పట్టడంపై ఇరు గ్రామాల ప్రజలు కొన్నేళ్ల క్రితం అభ్యంతరం తెలిపారు. కానీ ఈవివాదం ఇరు ప్రాంతాల పెద్దమనుషుల జోక్యంతో పరిష్కారమైంది. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సమస్య పరిష్కారంతో ఇరు ప్రాంతాల ప్రజలు నదిలో చేపలు పట్టడం ద్వారా ఉపాధి పొందుతున్నారు.

**పర్యాటక అభివృద్ధికి అవకాశాలు**

అరుదైన సహజ సౌందర్యం ఉన్న తలాయి ప్రాంతం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. ఇక్కడికి చేరుకోవడానికి రోడ్డు మార్గం ఉంది. ఈప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి కల్పించవచ్చు. ఇక్కడికి ఏటా వందల సంఖ్యలో ప్రకృతి ప్రేమికులు వస్తుంటారు. ప్రాణహిత నదికి మహారాష్ట్ర వైపు కమలాపూర్ ఏనుగుల సంరక్షణ కేంద్రం, వెంకటాపూర్ వెంకటేశ్వర ఆలయం, భామ్రాగడ్ పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి.

**జీవనోపాధి..**

నదులు నాగరికతకు నిలయాలు. నదుల్లోని వనరులను వినియోగించుకుని మనిషి తరాలుగా లబ్ధిపొందుతున్నాడు. తలాయి వద్ద ప్రాణహిత నదిలో చేపలు పట్టడం ద్వారా 150కు పైగా కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. తలాయి గ్రామం నుంచి సుమారు 10 కిలోమీటర్ల దూరం నీటిమట్టం ఏకాలంలోనూ అడుగంటదు. మహారాష్ట్ర వైపు దేవలమర్రి, తలాయి, సమీప గ్రామాల్లోని ప్రజలు ఎనిమిది నెలల పాటు నదిపై ఆధారపడి జీవిస్తారు. దీనికోసం నదీ తీరంలోని ఇసుకలో తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుంటారు. పిల్లా పాపలతో ఇక్కడే నివాసం ఉంటారు. నేటికీ సంప్రదాయ పద్ధతులైన నాటుపడవలు, వలల ద్వారా చేపలు పట్టడం విశేషం. ప్రాణహిత నదిలో దొరికే చేపలకు స్థానిక మార్కెట్‌లో డిమాండ్ ఉంది.



నదిలో చేపలు పడుతున్న దంపతులు

**చేపల వేటతో ఉపాధి**



మహారాష్ట్ర వైపు ఉన్న దేవలమర్రి, తెలంగాణలోని తలాయి గ్రామానికి చెందిన ప్రజలు ఇక్కడ చేపలు పట్టుకుని జీవనోపాధి పొందుతున్నాం. గతంలో ఈప్రాంతంలో వివాదం ఉన్నా ఇరు ప్రాంతాల పెద్దమనుషులు సమస్య పరిష్కరించారు. ఎలాంటి వివాదాలు లేకుండా జీవనోపాధి పొందుతున్నాం.– పాణెం భీమన్న, తలాయి

**కుటుంబమంతా ఇక్కడే..**



వర్షాకాలం ముగిసిందంటే నదీ తీరానికి వస్తాం. నా భార్య, కొడుకు, కోడలు ఇక్కడే నివాసం ఏర్పాటు చేసుకుంటాం. నెలల తరబడి నదిలోనే జీవనం సాగుతుంది. వర్షాకాలంలో పంటలు వేసే సమయంలో తిరిగి ఊళ్లకు పోతాం. ఉపాధినిచ్చే ప్రాణహితను అదృష్టంలా భావిస్తాం.

– పాణెం శంకర్, తలాయి

**పూర్వీకుల నుంచి..**



మా కుటుంబాల్లో ఎక్కువ మందికి భూములు లేవు. ఇప్పుడిప్పుడే కొంత మంది ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్నా ఎక్కువ మంది నదిపై ఆధారపడి జీవిస్తున్నాం. మాతాతలు ఇక్కడే బతికారు. మేంకూడా ఇక్కడే బతుకుతున్నాం.

– తోకల చిన్నన్న, దేవలమర్రి

### ఇసుక లారీకి రూ.80వేల జరిమానా

**తాంసి(బోథ్):** భీంపూర్ మండలంలోని తాంసి(కె) శివారులో పెన్‌గంగ నది నుంచి మహారాష్ట్రకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఈ నెల 22న పిప్పల్‌కోటి వద్ద భీంపూర్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. లారీని స్టేషన్‌కు తరలించి పోలీసులు తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్‌శాఖ అధికారులకు లేఖ రాశారు. శనివారం సాయంత్రం జిల్లా మైనింగ్‌శాఖ అధికారులు ఇసుక విలువ అంచనా వేశారు. మైనింగ్‌శాఖ జిల్లా ఏడీ ఆర్.రవీందర్ లారీకి రూ.80వేల జరిమానా విధించినట్లు భీంపూర్ ఎస్సై కలీం ఆదివారం తెలిపారు. పెన్‌గంగ నుంచి ఇసుక తరలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

### కలప పట్టివేత



ఇచ్చోడలో పట్టుకున్న కలప, బైక్‌లు

**ఇచ్చోడ(బోథ్):** మండలంలోని హరినాయక్ తండా వద్ద ఆదివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనాలపై అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ రేంజి అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సిరిచెల్మ నుంచి ఇచ్చోడ వైపునకు వస్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కలప విలువ సుమారు రూ.27 వేలు ఉంటుందన్నారు. నిందితులు పరారీలో ఉన్నారని, కలపతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో అటవీశాఖ సిబ్బంది సజన్‌లాల్, విశ్వజిత్, నౌసిలాల్, శివచరణ్, తదితరులు పాల్గొన్నారు.

**దండేపల్లి:** మండలంలోని తాళ్లపేట అటవీ రేంజ్ పరిధిలోని నాగసముద్రం సమీపంలో రూ.5,649 విలువైన రెండు టేకు దుంగలను పట్టుకున్నట్లు డీఆర్వో సాగరిక తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కలప దుంగలు పట్టుకెళ్తున్న ఓ వ్యక్తిని వెంబడించడంతో పడేసి పారిపోయాడు. వాటిని తాళ్లపేట రేంజికి తరలించామని డీఆర్వో పేర్కొన్నారు. పట్టుకున్న వారిలో ఎఫ్‌బీవో రహీమొద్దీన్, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

## అట్టహాసంగా జాతీయ యోగా, కరాటే పోటీలు

**బెల్లంపల్లి:** బెల్లంపల్లిలో జాతీయస్థాయి యోగా, కరాటే చాంపియన్‌షిప్ 2024–25 పోటీలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. పట్టణంలోని పద్మశాలీ భవన్, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. స్పోర్ట్స్, కరాటే అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఎనగందుల వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ జె.శ్వేత, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్ ప్రారంభించారు. తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి దాదాపు 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈసందర్భంగా అతిథులు మాట్లాడారు. వ్యక్తిగత ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. యోగాను జీవితంలో భాగంగా చేసుకుంటే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. గెలుపు ఓటములను సమానంగా చూడాలని సూచించారు.



యోగాసనాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

**అలరించిన విన్యాసాలు..**

క్రీడాపోటీలకు ముందు చిన్నారులు యోగా, కరాటే విన్యాసాలు ప్రదర్శించారు. ఎంతో నేర్పుతో కరాటేను ప్రదర్శించడం ఆకట్టుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కరాటే, యోగా క్రీడాకారులు పోటాపోటీగా విన్యాసాలు చేసి అబ్బురపరిచారు. కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రవికుమార్, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, మున్సిపల్ కౌన్సిలర్ బండి ప్రభాకర్, ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకుడు మేడి పున్నంచందు, కరాటే మాస్టర్లు తగరపు శంకర్, ఎం.రాజేశ్, విజ్జగిరి రవి, నారాయణ, శిరీష పాల్గొన్నారు.

## ఆర్పీల పోరుబాట

- నేడు హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సమావేశం
- ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లనున్న మెప్మా రిసోర్స్ పర్సన్లు
- ఇప్పటికే మున్సిపల్ కమిషనర్ల నుంచి ముందస్తు అనుమతి..

**మంచిర్యాలటౌన్:** పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో పనిచేస్తున్న ఆర్పీ(రిసోర్స్ పర్సన్)లు పోరుబాట పట్టనున్నారు. ప్రభుత్వపరంగా నిధులు కేటాయిచాలని, గౌరవ వేతనాలు పెంచాలని, పీఆర్సీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో సోమవారం జరిగే తెలంగాణ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆర్పీల సంక్షేమ సంఘం సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఆర్పీలు సిద్ధమయ్యారు. సోమవారం మూకుమ్మడిగా హైదరాబాద్‌లో జరిగే యూనియన్ సమావేశానికి వెళ్లేందుకు శనివారం రోజే మున్సిపల్ కమిషనర్ల అనుమతి తీసుకున్నారు. ఈమేరకు అందరికీ సెలవు ఇవ్వాలని వినతిపత్రాలు అందించారు. మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ, వారిలో ఆర్థిక పురోగతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నా, ప్రభుత్వానికి అవసరమైన అన్ని రకాల సర్వేలు, కార్యక్రమాలను నిర్వహణలో పాలుపంచుకుంటున్నా, ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నా ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించడం లేదని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకన్నా ఎక్కువగా బరువు బాధ్యతలను మోస్తున్నా తమకు తగిన గుర్తింపు, శ్రమకు తగిన ఫలితం రావడం లేదని పేర్కొన్నారు. అధికారులు సైతం తమకు ఎలాంటి సంబంధం లేని పనులు చేయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్పీలు

**ప్రధాన డిమాండ్లు ఇవే..**

- జీవో 164 ప్రకారం వీఎల్‌ఆర్ స్త్రీనిధి, లోకల్ బాడీ నిధుల నుంచి ఆర్పీలకు గౌరవ వేతనాలను ఇవ్వాలనే నిబంధన తొలగించి, సెర్ప్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వీవోఏల మాదిరిగా ప్రభుత్వపరంగా ప్రత్యేక నిధులు కేటాయించి గౌరవ వేతనాలు ఇవ్వాలి.
- గత ప్రభుత్వం అన్నిరంగాల వారికి 30 శాతం పీఆర్సీ అమలు చేసి ఆర్పీలకు మాత్రమే ఇవ్వలేని, పీఆర్సీ అమలు చేయాలి.
- ఆర్పీలకు కనీస వేతనం రూ.20 వేలు ఉండాలి.
- ఆర్పీలందరికీ గుర్తింపు వచ్చేలా రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన డ్రెస్‌కోడ్ అమలు చేసి జాబ్‌చార్ట్ విడుదల విడుదల చేయాలి.
- ఆర్పీలు మరణిస్తే వారి కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల బీమా సౌకర్యం ఇవ్వాలి.
- మూడు నెలలకు ఒకసారి ఈసీల తీర్మానం రద్దు చేయాలి.

## సెలవంటూ వెళ్లిపోయారు..!

- ఈ ఏడాది ప్రముఖుల అస్తమయం
- ఉమ్మడి జిల్లాలో విషాదం

2024 సంవత్సరం కష్ట సుఖాలకు నిలయమైంది. ఎన్నో మంచి కార్యక్రమాలు ఈ ఏడాది జరిగాయి. ఇదే సమయంలో కొన్ని విషాద ఘటనలూ జరిగాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు ఈ ఏడాది పరమపదించారు. గుస్సాడీ నేస్తం కనకరాజు కన్ను మూశాడు, గోండిలిపి యోధుడు అస్తమించాడు. తొలితరం రాజకీయ నేత నర్సారెడ్డి మృతి చెందాడు.

**నేల రాలిన గుస్సాడీ నేస్తం!**



**కెరమెరి(ఆసిఫాబాద్):** గుస్సాడీ అంటేనే కనక రాజుగా భావించే గుస్సాడి రాజును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 2024లో కోల్పోయింది. గుస్సాడీ కళానృత్యాన్ని తన సర్వస్వంగా భావించిన కళాప్రపూర్ణ కనక (గుస్సాడి)రాజు ఈ ఏడాది అక్టోబర్ 24న జైనూర్ మండలంలోని మార్లవాయిలో మృతి చెందాడు. 1981లో అప్పటి ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధి ఏడు నిమిషాల పాటు రాజుతో నృత్యం చేసింది. ఆమెకు నెమలి పింఛాల టోపీని తొడిగించి, కాళ్లకు గజ్జెలు కట్టి, చేతికి దుడ్డు (కర్ర) ఇచ్చిన ఏకైక వ్యక్తి కనక రాజు.



**నర్సన్నబాపు అస్తమయం..**

**నిర్మల్:** నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం మలక్‌చించోలికి చెందిన పొద్దుటూరి గంగారెడ్డి ఏకైక సంతానం నర్సారెడ్డి (నర్సన్నబాపు) 1931 సెప్టెంబర్ 22న జన్మించారు. 1971 నుంచి 1972 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడిగా సేవలందించారు. 1978 ఎన్నికల తర్వాత అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు మంత్రివర్గంలో నీటిపారుదల శాఖ, రెవెన్యూశాఖ, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రిగా పనిచేశారు. 1967 నుంచి 1982 వరకు మూడు పర్యాయాలు గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా పనిచేశారు. 1991లో ఆదిలాబాద్ ఎంపీగా, ఒకసారి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, నిబంధనల కమిటీ, ప్రభుత్వ హామీల కమిటీ, విజ్ఞాపనల కమిటీ, సంప్రదింపుల కమిటీల సభ్యుడిగానూ పనిచేశారు. వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా ఈ ఏడాది జనవరి 29న హైదరాబాద్‌లోని తన నివాసంలోనే తుదిశ్వాస విడిచారు.

**‘ఇథనాల్’ మంటలు**

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు వద్దంటూ జనవరి 26న నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల రైతులు రోడ్డెక్కారు. దిలావర్‌పూర్, గుండంపల్లి, సముందర్‌పల్లి, టెంబుర్నితో పాటు సమీప గ్రామాల ప్రజలు మండల కేంద్రంలోని 61వ జాతీయ రహదారిపై బైఠాయించారు. ఆర్డీవో రత్నకల్యాణిని అడ్డుకుని వాహనంపై దాడి చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిర్మించిన ఇథనాల్ ఫ్యాక్టరీపై రైతులు దాడి చేసి, ప్రహరీగోడను కూల్చడంతో పాటు ఒక వాహనానికి నిప్పుపెట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జీ చేశారు.



ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దని ఆందోళన (ఫైల్)

- మండలంలోని రైతులు, యువకులతో పాటు మహిళలు, వృద్ధులు, చిన్నారులు సైతం ఆందోళనలో పాల్గొనడం, పరిస్థితి సీరియస్‌గా మారడంతో జిల్లా అధికారుల సమాచారం మేరకు జనవరి 27న రాష్ట్ర ప్రభుత్వం ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు మండల వాసులు ఆందోళన విరమించారు.

**గోండి లిపిని ప్రపంచానికి తెలియజేసిన యోధుడు**


**నార్నూర్:** గోండి లిపి ప్రతులను ప్రపంచానికి తెలియజేసిన యోధుడు కోట్నాక్ జంగు. 2014లో నార్నూర్ మండలంలోని గుంజాలలో గోండి లిపి అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయడంలో ప్రముఖుడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 పాఠశాలను నెలకొల్పి 400 మంది విద్యార్థులకు గోండి లిపిలో విద్యాబోధన చేశారు. ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు సహకారంతో గోండి లిపిలో 2014లో మొదటి వాచకం, 2016లో రెండో వాచకం రాశారు. 2024 సెప్టెంబర్ 23న అనారోగ్యంతో మృతి చెందాడు.



కోట్నాక్ జంగు (ఫైల్)

## ‘మాలలు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి’

**ఆదిలాబాద్‌రూరల్:** మాలలు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాల సంక్షేమ సంఘం భవనం వద్ద మాలల భవిష్యత్ కార్యాచరణ, జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అంబేడ్కర్, పీవీరావు, కాక చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ అంశంపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలు ఐక్యం కావాలని ఎప్పటినుంచో నాయకులు కృషి చేస్తున్నా ఫలితం లేదన్నారు. కానీ ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు అనంతరం ఐక్యం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జేఏసీ చైర్మన్ చిన్నయ్య, కన్వీనర్ సర్వయ్య, ఓయూ జేఏసీ నాయకులు మందాల భాస్కర్, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ బాలరాజు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు రాజేశ్వర్, స్వరూప, మేకల మల్లన్న, మధుకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

## దారి దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

**గుడిహత్నూర్(బోథ్):** దారి దోపిడీకి యత్నించిన కేసులో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భీమేష్ తెలిపారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. స్థానిక దుర్గా వైన్స్‌లో పనిచేస్తున్న బండి సురేష్ నిత్యం వైన్స్‌లో వచ్చిన డబ్బులతో రాత్రి కిలోమీటర్ దూరంలో ఉన్న ఇంటికి వెళ్తుండేవాడు. అది గమనించిన మండలంలోని మన్నూర్‌కు చెందిన ఘుగె రోహన్, జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌కు చెందిన సెంబెటి సాయికుమార్, హమాలీవాడకు చెందిన మీసాల అజయ్, విద్యానగర్‌కు చెందిన ఇల్లెందుల శివ ప్రసాద్ ఈ నెల 25న రాత్రి జాతీయ రహదారి 44పై సురేష్ వాహనాన్ని నిలువరించి కంట్లో కారం చల్లి డబ్బుల సంచి లాక్కునే ప్రయత్నం చేశారు. బాధితుడు ప్రతిఘటించడంతో తమతో తెచ్చుకున్న కత్తులతో గాయపరిచారు. గట్టిగా అరవడంతో పరారయ్యారు. బాధితుడు వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై మహేందర్ దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీలు, ఇతర ఆధారాల ప్రకారం పాత నేరస్తుడైన రోహన్‌పై నిఘా పెట్టగా దోపిడీకి పాల్పడినట్లు నిర్ధారించారు. అతని కాల్‌డేటా ఆధారంగా మిగతా వారిని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రెండు స్కూటీలు, దోపిడీకి వాడిన కత్తులు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా వారంతా పాత నేరస్తులుగా గుర్తించారు. రోహన్ గతంలో సుపారీ హత్య కేసులో, పోక్సో కేసులో నిందితుడిగా ఉన్నాడు. జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం నేరాలకు పాల్పడుతున్నారని గుర్తించారు. నిందితులపై రౌడీ షీట్ తెరువనున్నట్లు సీఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమేష్

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

**రెబ్బెన(ఆసిఫాబాద్):** గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన వడాయి బాపురావు (52) కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం కొండపల్లి బస్టాండ్ వద్ద గల చికెన్ సెంటర్‌లో పని చేశాడు. రాత్రి చికెన్ సెంటర్ వ్యర్థాలను ఊరి బయట పడేసి వస్తుండగా కైరిగాం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. బాపురావుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే రోడ్డు ప్రమాదానికి బోలెరో కారణమని ప్రత్యక్ష సాక్షులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు వాహనం కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు సమాచారం.